ప్రజాశక్తి
మంగళవారం 23 ఏప్రిల్ 2024
I
అల్లూరి సీతారామరాజు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సోమవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రాడ్యుయేషన్ కార్యక్రమం చిన్నపిల్లలను ఉత్తేజ పరుస్తుందని, కొత్త ఆశయాలు, అవకాశాలతో కూడిన భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యాభ్యాసంలో నేర్చుకున్న కొన్ని విషయాలను, ఆటల రూపంలో విద్యార్థులు ప్రదర్శించారు. ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్ రాజు, పాఠశాల సిబ్బంది చెండ .మత్స్యరాజు, సీసా దొన్ను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాజరైన ప్రభావతి, ఉపాధ్యాయులు

కోలాహలంగా సిపిఎం అభ్యర్థి లోతా రామారావు నామినేషన్

- ఎరుపెక్కిన రంపచోడవరం
- ఆకట్టుకున్న కొమ్ముడోలు, రేలా నృత్యాలు
- ఆదివాసీలకు అన్యాయం చేస్తున్న బిజెపి, పొత్తు, తొత్తు పార్టీలను ఓడించాలని వక్తలు పిలుపు

నామినేషన్ అందజేస్తున్న లోతా రామారావు, చిత్రంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, రంపచోడవరం విలేకరి

కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ పార్టీలు (ఇండియా వేదిక) బలపర్చిన రంపచోడవరం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు నామినేషన్ కార్యక్రమం సోమవారం కోలాహలంగా జరిగింది. రంపచోడవరం డివిజన్ కేంద్రంలోని సబ్ కలెక్టరు కార్యాలయంలో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా బస్టాండ్ సెంటర్, ఫారెస్ట్ చెక్‌పోస్టు, ఎపిఆర్ జూనియర్ కాలేజీ ఆవరణ వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. ఓ వైపు భానుని ప్రతాపం తీవ్ర ప్రభావం చూపినప్పటికీ కార్యకర్తలు, ప్రజలు వెనుతిరగలేదు. వేలాది మంది ఎర్రజెండాలు చేతబూని ముందుకు కదిలారు. దీంతో సోమవారం మధ్యాహ్నం రంపచోడవరం డివిజన్ కేంద్రం ఎరుపెక్కింది. సుమారు కిలో మీటరు మేర ఈ మహా ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో గిరిజన సంప్రదాయ కొమ్ముడోలు నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల రేలా నృత్యాలు, పురుషుల బృందం సిపిఎం పోరాటాలను వివరిస్తూ చేసిన డ్యాన్స్, ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో సుమారు వందమంది కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు, అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స, రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి లోతా రామారావు, ఇతర నాయకులు ప్రచార వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం కాలేజీ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన సమస్యల పరిష్కారంతో పాటు, రాజ్యాంగ హక్కులను, చట్టాలను కాపాడుకోవాల్సిన కర్తవ్యం ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు. టిడిపికి, వైసిపీకి వేసిన ప్రతి ఓటూ బీజేపీకి చేరుతందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే అమిత్ షా ఢిల్లీ నుంచి రాష్ట్రాన్ని పాలించే ప్రమాదం పొంచి ఉందన్నారు. టిడిపి, వైసిపి ప్రభుత్వాల నిర్వాకం వల్ల పోలవరం ప్రాజెక్టు కాళేశ్వరం కంటే బలహీనంగా మారిందని హెచ్చరించారు. ప్రాజెక్టుకు ప్రమాదం జరిగితే గిరిజన ప్రాంతాలతో పాటు ఉభయగోదావరి జిల్లాలు పూర్తిగా ముంపునకు గురవటం ఖాయమని హెచ్చరించారు. పోలవరం నిర్వాసితుల హక్కుల కోసం, ఆదివాసీల చట్టాల కోసం సిపిఎం చేసిన పోరాటాలను గుర్తు చేశారు. ఉపాధి హామీ, అటవీహక్కులు, సమాచార హక్కు చట్టాలు వామపక్ష పార్టీల మద్దతుతోనే సాధ్యమైందన వివరించారు. అడవిపై ఆదివాసీలదే హక్కు అని చాటేందుకు ఇండియా వేదిక బలపర్చిన అభ్యర్థులను గెలిపించి చట్టసభలకు పంపించాలని కోరారు. మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు మాట్లాడుతూ ఏజెన్సీ పెద్ద దొంగ అనంతబాబు అని మండిపడ్డారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి వందల కోట్లు దోచేశారని విమర్శించారు. అటువంటి దొంగలకు, మద్దతు పలికే అవకాశ వాద రాజకీయ పార్టీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గోదావరి వరదలు మూడేళ్లు పాటు వరుసగా ఈ ప్రాంతాన్ని ముంపునకు గురిచేసినా టిడిపి, వైసిపి ప్రజా ప్రతినిధులెవరూ పట్టించుకోలేదని గుర్తు చేశారు. కమ్యూనిస్టులే అండగా నిలిచి బాధితులకు సేవలందించారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏజెన్సీని దోచుకుంటున్న పందికొక్కులను తరిమికొట్టి, పోరాట యోధులైన సిపిఎం అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పల నర్స మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో ఈ ప్రాంత అభివృద్ధికి టిడిపి, వైసిపి పాలకులు కనీస చొరవ చూపలేదన్నారు. 2024 ఎన్నికలు దేశ ప్రజల భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయని, అటువంటి కీలకమైన ఈ ఎన్నికలలో గిరిజన సమస్యల పరిష్కారంతో పాటు రాజ్యాంగం, అటవీ హక్కులను కాపాడుకునేందుకు సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం తరుపున పని చేసిన మాజీ ఎమ్మెల్యేలు సున్నం రాజయ్య, కుంజా బొజ్జి స్ఫూర్తితో అదే ఒరవడిని కొనసాగిస్తామని చెప్పారు. రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి లోతా రామారావు మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో టిడిపి, వైసిపి ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలపై కనీసంగా స్పందించిన దాఖలాలు లేవన్నారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో భౌగోళికంగా ఏర్పడిన సమస్యలను వివరించారు. రంపచోడవరం ప్రత్యేక జిల్లా కోసం కృషి చేస్తానని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, ఆదివాసీ సంఘాల జెఎసి నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి డి.సత్యనారాయణ, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, మర్లపాటి నాగేశ్వరరావు, విఆర్‌పురం ఎంపిపి కారెం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామారావు నామినేషన్‌కు తరలివెళ్లిన సిపిఎం శ్రేణులు

విఆర్.పురం : సిపిఎం అభ్యర్థి లోతా రామారావు నామినేషన్ కార్యక్రమానికి విఆర్ పురం మండలం నుండి సిపిఎం, ఇండియా వేదిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. ఉదయం నుంచే ఆయా గ్రామాల నుండి మండల కేంద్రం రేఖపల్లికి చేరుకొని అక్కడ నుండి బయలుదేరారు. మారుమూల గ్రామాల నుండి సైతం జనం కదిలి వెళ్లారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, చిత్రంలో మాజీ ఎంపీ మిడియం బాబూరావు, ఇండియా వేదిక నాయకులు

కొమ్ముడోలు, రేలా నృత్యాలతో సాగుతున్న భారీ ప్రదర్శన

జిల్లాలో పెరిగిన టెన్త్ ఉత్తీర్ణత

-గత ఏడాది 61.41, ఈ ఏడాది 90.95 శాతం

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో ఈ ఏడాది టెన్త్ ఉత్తీర్ణత గణనీయంగా పెరిగింది. జిల్లాలో 2023లో 61.41శాతం టెన్త్ ఉత్తీర్ణత లభించింది. ఈసారి 90.95శాతం టెన్త్ ఉత్తీర్ణత పెరగడం విశేషం. జిల్లాలో 4958 మంది బాలురు, 5865 మంది బాలికలు మొత్తం 10,823 మంది విద్యార్థిని విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరు కాగా 9843 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 88.77 శాతం బాలురు 92.79 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణులైన వారిలో 6243 మంది ఫస్ట్ క్లాస్ 2423 మంది సెకండ్ క్లాస్ 117 మంది థర్డ్ క్లాస్ సాధించారు.

ప్రత్యేక బోధనతో మంచి ఫలితాలు

ఆంధ్ర ప్రదేశ్ ఎస్ ఎస్‌సీ ఫలితాల్లో గిరిజన విద్యార్థిని, విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారు. సూపర్ 50లో ప్రత్యేక తర్ఫీదు పొంది గిరిజన విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ప్రత్యేక చొరవ, గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు అందించిన విద్యా బోధనతో గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. పాడేరు ఐటిడి ఏ పరిధిలోని 117 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నుంచి 30 మంది బాలికలను, 20 మంది బాలురను ఎంపిక చేసి సుమారు ఐదు నెలలు ప్రత్యేక బోధన అందించారు. గుత్తుల పుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో బాలికలకు, మోదాపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో బాలురకు ప్రత్యేక బోధన అందించారు. 2023 అక్టోబరు నెల నుండి పది పరీక్షల వరకు బోధన అందించడం జరిగింది.
పది ఫలితాల్లో బాలికలలో కిల్లో దారమణి (585) మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. పసుకోని దీపిక (549). కె. ధన లక్ష్మి (547) మార్కులు సాధించారు. బాలురలలో కిల్లో తిరుపతి (566), తాంగుల హరిలాలు ప్రసాద్ (562), పామర్తి సాయి కిరణ (542) సాధించారు.

నగదు బహుమతి ఇస్తాం: పిఒ

సూపర్ ఫిఫ్టీలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసి సన్మానిస్తామని ఐటిడిఏ పిఒ వి.అభిషేక్ చెప్పారు. పదిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను, ఉత్తమ బోధన అందించిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేసారు. ఉపాధ్యాయులు చేసిన కృషిని ప్రశంసించారు.

అంధకారంలో డుంబ్రిగుడ

-వెలుగని వీధిదీపాలు

ప్రజాశక్తి డుంబ్రిగుడ: మండల కేంద్రంలో వీధి దీపాలు వెలుగక పోవడతో సుమారు గత రెండు నెలల నుంచి మండల కేంద్రం అంధకారంలో ఉంది. మండల మండల కేంద్రం మెయిన్ రోడ్డుతో పాటు గ్రామంలోని పురవీధుల్లో వీధి దీపాలు మరమ్మతు గురై సుమారు రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అధికారులు స్పందిచ లేదు. దీంతో మండల కేంద్రం వాసులతోపాటు వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రుల్లో చిమ్మ చీకటిగా ఉండటంతో విష సర్పాలు సంచరిస్తున్నాయి. దీంతో, ఇరుగుపొరుగు గృహాలకు వెళ్లాలన్నా తీవ్ర భయాందోళనకు గురవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సార్లు ప్రమాదవశాత్తు కొంతమంది వృద్ధులు కాలువలో పడిపోయి గాయాల పాలవుతున్నారని స్థానికులు తెలిపారు.వీధి దీపాలు పునరుద్ధరించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు.

వెలుగని వీధి లైటు

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ చైతన్య

ప్రతి ఇంట్లో దోమల నివారణ మందు పిచికారీ

ఐటిడిఎ పీవో కావూరి చైతన్య

ప్రజాశక్తి-చింతూరు

ప్రతి ఒక్క ఇంట్లో మలేరియా ద్రావణాన్ని స్ప్రే చేయించుకోవాలని చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య పిలుపునిచ్చారు. సోమవారం ఐటిడిఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బందికి టెక్నికల్ శిక్షణను అందివ్వాలని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ పుల్లయ్యను ఆదేశించారు. చింతూరు డివిజన్లో మొత్తం 157 గ్రామాల్లో మొదటి విడత మలేరియా మందు పిచికారి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 15 నుండి జూన్ 15 వరకు మొదటి విడత దోమల నివారణ పిచికారి కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఏఎంఒ శ్రీనివాసరావు, పిహెచ్సి వైద్యాధికారులు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉరుములతో భారీ వర్షం

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దారకొండ పరిసర గ్రామాల్లో ఆది, సోమవారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ మధ్యాహ్నం వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఒకసారిగా మబ్బులతో కూడిన వాతావరణంతో పాటు మేఘావృతమే చల్లటి గాళ్లు వీస్తూ వర్షం కురిసింది. గత రెండు నెలలుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు వేడిమికి తట్టుకోలేక అనేక ఇబ్బందులు గురయ్యారు. గత రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో దారకొండ పరిసర ప్రాంతాల్లో చల్లటి వాతావరణం నెలకొంది. గత రెండు రోజుల నుంచి కురిసిన వర్షానికి భూమి కాస్త చల్లబడి ఉష్ణోగ్రతలతో పాటు వడగాల్పులు తగ్గుముఖం పట్టాయి. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

సీలేరులో కురుస్తున్న భారీ వర్షం

రోడ్డు పనులు పూర్తి చేయాలని.. గిరిజనులు ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి: అసంపూర్తిగా వదిలి వేసిన రోడ్డు పనులు తక్షణమే పూర్తి చేయాలని ఆయా గ్రామాల గిరిజన ప్రజల చీడివాడలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, మండలంలోని పెద్దకోట పంచాయతీ కొండ శిఖరు గ్రామాలైన చీడివలస మీదుగా పాతిపల్లి, బందకొండ వరకు రోడ్డు నిర్మించేందుకు గాను 2017 సంవత్సరంలో మొదట విడతగా 19 లక్షల 40 వేలు, రెండో విడత 27 లక్షలు , మూడో విడతగా తొమ్మిది లక్షలు మొత్తం 55 లక్షల 40 వేలు మట్టి ఫార్మేషన్, రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. సుమారు 6 కిలోమీటర్లు మట్టి రోడ్డు పనులు జరిగాయని, 2021 సంవత్సరంలో రెండు కోట్ల 15 లక్షలతో సిబిఎస్ మెటల్ రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా పనులు పూర్తి చేయకుండా తూతు మంతంగా చేపట్టి వదిలివేసారని తెలిపారు. సీసీ ర్యాంపులు కలర్టులు నిర్మించినట్లు రికార్డులు సృష్టించి సుమారు 1 కోటి 93 లక్షల 41 వేల రూపాయలు నిధులను పక్కదారి పట్టించారని పెద్దకోట ఉప్పా మాజీ సర్పంచ్ కిల్లో నాగేశ్వరరావు, కాదాల ,అనీష్ లు ఆరోపించారు. రోడ్డు పనులు నిలిచి పోవడంతో రోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కాదెల, అనూష్ కాదెల కొండబాబు, విజయకుమరి, సోమల వసంత పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న గిరిజనులు

మోదకొండమ్మ ఉత్సవ రాటను వేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ఘనంగా మోదకొండమ్మ ఉత్సవ పందిరి రాట

ప్రజాశక్తి-పాడేరు : ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పాడేరు మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల పందిరి రాట ప్రతిష్ట సోమవారం శతకంపట్టు వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది మే నెల 19, 20, 21 తేదీల్లో మోదకొండ అమ్మవారి జాతర మహోత్సవాలను పాడేరులో నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ ఉత్సవాల నిర్వహణలో భాగంగా పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి పండగరాటను ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు ఉత్సవ కమిటీ అధ్యక్షులు రామారావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు తమర్భ ప్రసాద్ నాయుడు, వెంకటరమణ, ఇతర ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులతో కలిసి అమ్మవారి పండగ రాటను ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి యేటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అత్యంత వైభవంగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవంగా కొలిచే అమ్మవారి వేడుకలు నిర్వహణకు సంబంధించి ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లను చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి సుబ్రహ్మణ్యం, మెయిన్ రోడ్డు వర్తక ప్రముఖులు ఊడా త్రినాధరావు, భూరెడ్డి రాము నాయుడు, రోబ్బి శంకర్రావు, శివరాత్రి శ్రీను, సత్య నారాయణ, జనార్ధన్, గోపి ముకుందరావు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లాలో 13 నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి పాడేరు:

అల్లూరి జిల్లాలో సోమవారం నామినేషన్ల సందడి నెలకొంది. అల్లూరి జిల్లాలో 13 నామినేషన్లు దాఖలు అయ్యాయి. అరకు అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఐదు, పాడేరు అసెంబ్లీ సెగ్మెంట్ కు నాలుగు, రంపచోడవరం అసెంబ్లీ సెగ్మెంట్ కు నాలుగు చొప్పున నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఈ సందర్భంగా సిపిఎం, వైసీపీ, టీడీపీ అభ్యర్థులు తమ పార్టీల శ్రేణులు తో కలిసి భారీ ర్యాలీలతో నామినేషన్లు వేశారు. పాడేరులో జోరు వానలో కూడా నామినేషన్ల ర్యాలీలు జరిగాయి. అరకు, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గ కేంద్రాలకు చుట్టుపక్కల మండలాలు నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావడంతో నియోజకవర్గ కేంద్రాలు జనసంద్రంగా మారాయి. రంపచోడవరం లో సిపిఎం అభ్యర్థి లోతా రామారావు, వైసిపి అభ్యర్థి ఎన్ ధనలక్ష్మి, ఇండిపెండెంట్ అభ్యర్థి పి లక్ష్మి ప్రసన్న, నామినేషన్లు వేశారు. పాడేరులో టిడిపి అభ్యర్థి గిడ్డి ఈశ్వరి, కాంగ్రెస్ అభ్యర్థి శతక బుల్లిబాబు, బీఎస్పీ అభ్యర్థి సొర్ల అప్పారావు, ఇండిపెండెంట్ అభ్యర్థి వంతాల సుబ్బారావు నామినేషన్లు దాఖలు చేశారు.

అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజక వర్గం అభ్యర్థులుగా ఐదు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి అభ్యర్థి రేగం మత్స్యలింగం రెండు నామినేషన్లు దాఖలు చేశారు. వైసిపి అభ్యర్థితో ఈ నామినేషన్ కార్యక్రమానికి వైసిపి నాయకులు కుంభ రవిబాబు, ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ, జిల్లా పరిషత్ చైర్పర్సన్ సుభద్ర తదితరులు హాజరయ్యారు. వైసిపి డమ్మీ అభ్యర్థిగా రేగం చాణిక్య ఒక నామినేషన్ దాఖలు చేసారు. బిఎస్పీ అభ్యర్థి లకే రాజారావు ఒక నామినేషన్, స్వతంత్ర అభ్యర్థి మొగలి చంద్ర కళ ఒక నామినేషన్ పత్రాన్ని సమర్పించారు.

నామినేషన్లు వేస్తున్న వైసిపి, టిడిపి అభ్యర్థులు మత్స్యలింగం, గిడ్డి ఈశ్వరి

అభ్యర్థులు సహకరించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: ఎన్నికల నిబంధనలను దృష్టిలో పెట్టుకుని నామినేషన్ వేసే రాజకీయ పక్షాల అభ్యర్థులు సహకరించాలని సిఐ అంబటి విజయకుమార్ సూచించారు. ఆయన మాట్లాడుతూ నక్కపల్లి జాతీయ రహదారి ఆనుకొని ఉన్న ఆర్వో కార్యాలయం సమీపంలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో నామినేషన్ నిబంధనల ప్రకారం అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే ఆర్ఓ కార్యాలయానికి అనుమతి ఇస్తామన్నారు.మిగిలిన అనుచరులు 100 మీటర్ల దూరంలో ఉండాలని సూచించారు.జాతీయ రహదారిపై ట్రాఫిక్ ను దృష్టిలో ఉంచుకొని అభ్యర్థుల తరపున వచ్చే ఆయా పార్టీ శ్రేణులంతా ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలిగించకుండా పోలీసులకు సహకరించాలన్నారు.

అంధుల క్రికెటర్ రవణి ఓటర్లను చైతన్య పరచాలి

కలెక్టర్ ఎం.విజయ సునీత

ప్రజాశక్తి పాడేరు, : భారతదేశం తరపున అందుల క్రికెట్‌లో ఆల్ రౌండర్ వలసినేని రవణి ఓటింగ్‌లో ఓటర్లు పాల్గొనేలా ఓటర్లను చైతన్య పరచాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలెక్టర్ ఛాంబర్‌లో ఆమె కలిసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ,రవణిని యూత్ ఐకాన్ గా అభివర్ణిస్తూ, యువత ఓటింగ్ లో పాల్గొనేలా చైతన్య పరచాలన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న స్వీప్ కార్యక్రమాలలో పాల్గొనాలని సూచించారు. హుకుంపేట మండలంలోని రంగసింగిపాడు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన రవణి భీమిలి బీచ్ రోడ్‌ల చిన జీయర్ స్వామి ఆశ్రమంలో నేత్ర విద్యాలయంలో చదువుకుని ప్రస్తుతం హైదరాబాద్ లో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఇటీవల ఇంగ్లండ్‌లో జరిగిన అంతర్జాతీయ అంధుల క్రికెట్ పోటీలో ఆల్ రౌండర్ గా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్న రవణి, తనకు ఓటు హక్కు లేకపోయినప్పటికీ ఓటు హక్కు వినియోగం పట్ల ఓటర్లను చైతన్య పరుస్తున్న రవణిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. రవణితో పాటు ఆమె తల్లి చిట్టమ్మను కూడా కలెక్టర్ అభినందించారు.

రవణిని అభినందిస్తున్న కలెక్టర్

సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి

అప్పలనర్సను గెలిపించండి

దుంబ్రిగుడలో ప్రచారం చేస్తున్న సిపిఎం నేతలు పోతురాజు, తదితరులు

ప్రజాశక్తి దుంబ్రిగుడ:- ఇండియా కూటమి బలపరిచిన సిపిఎం అరకు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పి అప్పలనర్సకు ఓటేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని గుంటగన్నెల పంచాయతీ కూనపుట్టు, బుడ్డపుట్టు, జాముగుడ గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజు మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం గిరిజన చట్టాలు, హక్కులను నిర్వీర్యం చేస్తుందన్నారు. అటవీ హక్కు చట్టాన్ని సవరించి కార్పొరేట్లకు అటవీ భూములను ధారాదత్తం చేసేందుకు కుట్ర పన్నుతుందని విమర్శించారు. ఆదివాసి హక్కులు, చట్టాలపై నిరంతరం పోరాటం సాగిస్తున్న సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించి చట్టసభల్లోకి పంపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు టి సూర్యనారాయణ, పి సత్యనారాయణ, పి డంబు, పి కుమారి, పీ తిలక్, గిరిజనులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలం లోని భీమవరం పంచాయితీ భీమవరం గ్రామంలో జరుగుతున్న ఇటుకల పండగలో వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు ప్రచారం చేపట్టారు. అరకు సీపీఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్స ను గెలిపించాలని కోరారు. గిరిజన ప్రజల కోసం అప్పలనర్స ఎన్నో పోరాటాలు చేస్తున్నారన్నారు.. ఈ కార్యక్ర మంలో తూబూరు కోటిబాబు, సుజాత, రాజబాబు, జ్యోతి, నైని రామన్న, సత్తిబాబు, మత్స్య రాజు, నైని చిట్టిమ్మ, నైని చిట్టిబాబు పాల్గొన్నారు.

చింతపల్లిలో కరపత్రాలను పంచుతూ ప్రచారం చేస్తున్న చిన్నయ్యపడాల్

చింతపల్లి: మండలంలోని లంబసింగి పంచాయతీ తోటరాజు బందా గ్రామంలో సిపిఎం నేతలు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నేత చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, 25 సంవత్సరాలుగా ఉద్యమాలే ఊపిరిగా నిరంతరం పోరాటం చేస్తున్న అప్పలనర్సను గెలిపించాలని కోరారు.

నేడు 'సిద్ధం' యాత్ర పునఃప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : సిఎం జగన్ మేమంతా సిద్ధం బస్‌యాత్ర పిఎంపాలెం క్రికెట్ స్టేడియం నుంచి మంగళవారం మళ్లీ ప్రారంభమౌతుందని భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. మధురవాడ మిథిలాపురం వుడాకాలనీలో సిఎం బస వద్ద విలేకర్లతో మాట్లాడుతూ, ఒకరోజు విరామం తర్వాత మంగళవారం ఉదయం 9 గంటలకు రోడ్డు షో ప్రారంభమై, ఆనందపురం మీదుగా సాగుతుందని, పెద్దిపాలెం చెన్నై కన్వెన్షన్ సెంటర్‌లో సోషల్ మీడియాతో ఇంట్రాక్షన్, తర్వాత అక్కడే మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. అనంతరం యాత్ర విజయనగరం జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

టెన్త్‌లో సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-పాడేరు: స్థానిక 'శ్రీ మోదమాంబ పాఠశాల విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి విజయ ఢంకా మోగించారు. ప్రథమ స్థానం బోయిని నందిని-564, కిముడు భార్గవ్ నాయుడు-563, షేక్ లతిఫా-562 మార్కులు సాధించారు. 500 మార్కులకుపైన 20 మంది విద్యార్థులకు రాగా మిగతా వారంతా ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్‌నాగమణి, సిబ్బంది అభినందించారు.

అరిసెల శిరీష

ముంచంగిపుట్టు: మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలతో పాటు కేజీబీవీ, జడ్పీ హైస్కూల్, ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, గవర్నమెంట్ హైస్కూల్ పాఠశాలలో మంచి ఉత్తీర్ణతలు సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి కృష్ణమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని కిలగడ కేజీబీవీ పాఠశాలలో అరిసెల శిరీష 530 మార్కులతో మండలంలో ప్రథమ శ్రేణిలో నిలిచింది. 487 మార్కులతో ద్వితీయ స్థానాన్ని విద్యార్థుల వి.సావిత్రి (జిటిడబ్ల్యూ బాలికలు ఆశ్రమ పాఠశాల), కుసుమ 487 మార్కులు సాధించారు. జి టి డబ్ల్యూఏఎస్ బాలురు 1 పాఠశాలలో 39 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 37 మంది ఉత్తీర్ణత పొందారు. జడ్పీ హైస్కూల్ జోలాపూట్ లో 52 కి 43, జోలాపుట్టు ఇంగ్లీష్ మీడియం బాలికల ఆశ్రమ పాఠశాలలో 55కి 53 , గవర్నమెంట్ హై స్కూల్ కిలగడ 30కి 26, కేజీబీవీ కిలగడ పాఠశాలలో 30 మందికి 26 మంది ఉత్తీర్ణతలు పొందారు.మండల వ్యాప్తంగా 402 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా360 మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారని తెలిపారు.

సత్యభానుప్రియ

పెదబయలు: మండలంలో టెన్త్ ఫలితాల్లో 91.93శాతం ఫలితాలు సాధించినట్లు మండల విద్యాశాఖధికారిణి గుమ్మా పుష్పవతి సోమవారం తెలిపారు. స్థానిక సెంట్రెన్ పాఠశాల విద్యార్థిని సత్యబాను ప్రియ 567 మార్కులతో మండలంలో మొదటి స్థానం సాధించిందని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో గెమ్మెలి విజయ్ కుమార్ 559 మార్కులు, దేవ ప్రతఫ్ నాయుడు 502, మేరీప్రసాద్ 516 మార్కులు సాధించారు.

అరకులోయ రూరల్: విశాఖపట్నం జిల్లా సరిపల్లి భాష్యం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అరకువేలి మండలానికి చెందిన గిరిజన విద్యార్థి సుంకరి సుశాంత్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచాడు. సుశాంత్ 600 మార్కులు గాను 581 (97 శాతం) మార్కులు సాధించాడు.సుశాంత్ తండ్రి సుంకరి దశరథ్ అరకలోయలో జర్నలిస్టుగా పని చేస్తున్నారు.

హుకుంపేట: మండలంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి గుమ్మడి మౌనిక 513 మార్కులు సాధించారు.

గుమ్మడి మౌనిక పాంగి ప్రమీల

గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల (బాకూరు) పాంగి ప్రమీల 502, జిల్లా పరిషత్ పాఠశాల (బాకూరు) 502 మార్కులు సాధించారు.మండల విద్యాశాఖ అధికారి సోమేలి చెల్లయ్య విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

శారదానికేతన్‌దే పైచేయి

అరకులోయ: టెన్త్ పరీక్ష ఫలితాల్లో అరకులోయ శారద నికేతన్ పాఠశాల విద్యార్థులు పైచేయి సాధించారు. అరకులోయ మండలంలో 14 పాఠశాలల నుంచి 780 మంది విద్యార్థులు టెన్త్ ఎగ్జామ్స్ రాయగా, వారిలో 572 మంది పాసయ్యారు. 208 మంది ఫెయిల్ అయ్యారు. 75 ఉత్తీర్ణత శాతం సాధించారు.

మండలంలో మొత్తం 14 పాఠశాలలో 12 గిరిజన సంక్షేమ పాఠశాలలు కాగా, రెండు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఇందులో శారదనికేతన్ పాఠశాలకు శతశాతం ఉత్తీర్ణత సాధించింది. 22 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 22 మంది పాసయ్యారు. కొర్ర కౌశిక్ 600 మార్కులకు గాను 589 మార్కులు సాధించి టాపర్గా నిలిచారు. గిరిజన సంక్షేమ పాఠశాలలు 12 ఉండగా, అరకులోయ క్రీడా పాఠశాల విద్యార్థి బాలు నాయక్ 531 మార్కులు సాధించి టాపర్గా నిలిచాడు. అరకులోయ హైస్కూల్లో 41 మంది పరీక్షలు రాయగా 29 మంది పాసయ్యారు. అలాగే సిఏహెచ్ స్కూల్లో 101 మందికి 55 మంది, బస్కి 29 మందికి 8 మంది, లోతేరు 25 మందికి 11 మంది, రవ్వలగూడ 66 మందికి 42 మంది, కొత్త బళ్ళుగూడ 91 మందికి 73 మంది, గన్నెల 37 మందికి 27 మంది, అరకులోయ బాలికల ఆశ్రమం ఉన్నత పాఠశాలలో 106 మందికి 69 మంది, టి డబ్ల్యూ ఆర్ ఎస్(జి) 109 మందికి 101 మంది, స్పోర్ట్స్ స్కూల్లో 30 మందికి 30 మంది, కేజీబీవీ 39 మందికి 31 మంది, పి టి జి(బాయ్స్) గురుకులం పాఠశాలలో 74 మందికి 65 మంది, బివికె పాఠశాలలో 10 మందికి 10మంది విద్యార్థిని విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు అరకులోయ ఎంఈఓ కే భారతరత్నం వివరించారు.

సుశాంత్

దుంబ్రిగుడ: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండల వ్యాప్తంగా 91 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండల వ్యాప్తంగా 13 పాఠశాలల నుంచి 462 మంది విద్యార్థులకు గాను 458 మంది పరీక్షలకు హాజరుకాగా 417 మంది ఉత్తీర్ణత సాధించారు.మండలంలోని కిల్లోగుడ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థిని కిల్లో దేవి 541, జామ్ గూడ బాలికల పాఠశాల విద్యార్థిని పి దేవి 517, నందివలస బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని జి ప్రియాంక 508 మార్కులు సాధించారు.

94.2శాతం ఉత్తీర్ణత

రంపచోడవరం : సోమవారం వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో రంపచోడవరం మండలంలో 94.2 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. విద్యా సంవత్సరంలో 764 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 720 మంది ఉత్తీర్ణత సాధించగా, 44 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు ఎంఈఓ తెలిపారు. రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.దీపికా నాగసత్యసాయి 537 మార్కులతో మండల టాపర్‌గా, శెట్టిపల్లి ఎపి రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ విద్యార్థి పి.దీపికా 534 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు.

దేవీపట్నం : మండలంలోని ఇందుకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు 58 మంది పరీక్షలు రాయగా, నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాల విద్యార్థి గొర్రెల లోకేష్ 571 మార్కులు సాధించి ప్రథమ స్థానంలోనూ, అయినాల సాయి శ్రీవల్లి 561 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. 9 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు వీరవల్లి ముత్యాలరావు తెలిపారు.

జి.లోకేష్

తోలేటి జ్యోతి అయినపల్లి ఆనంద్ ఎం.స్నేహలత

రాజవొమ్మంగి : స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్ నుండి 99 మంది పరీక్షలుకు హాజరు కాగా, 90 మంది పాసై 91 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు డి.వి.గోపాలకృష్ణ తెలిపారు. తోలేటి జ్యోతి 532 మార్కులతో ప్రథమ స్థానం, అయినవల్లి ఆనంద్ 527 మార్కులతో ద్వితీయ స్థానం, మన్నేపల్లి స్నేహలత 524 మార్కులతో తృతీయ స్థానం సాధించారు.

రాజవొమ్మంగి ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గర్ల్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తెలపాటి శ్యామల 533 మార్కులు, దూరపల్లి శ్రావణిశ్రీసునంద 529, నాగులపల్లి అఖిల 501 మార్కులు సాధించారు.

చింతూరు : చింతూరు మండలంలో 1452 మంది విద్యార్థులు పది పరీక్షలు హాజరుకాగా 1306 మంది విద్యార్థుల పాసై 90 శాతం ఉత్తీర్ణత సాధించారు. మంచి ఫలితాలు సాధించడం పట్ల చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య అభినందనలు తెలిపారు.

570 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన చింతూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి వి.వసుంధర 570కు రూ.7వేలు, 560 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన నరసింహపురం పాఠశాల విద్యార్థిని పి నవ్యకు రూ.6వేలు నగదు బహుమతులు ఐటిడిఏ పిఒ చైతన్య అందజేశారు. విద్యార్థులు ఇంకా క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి మార్కులు సాధించాలని పిఓ సూచించారు.

100 శాతం ఉత్తీర్ణత

మోతుగూడెం : చింతూరు మండలం మోతుగూడెం డిఎవి పబ్లిక్ స్కూల్ నుండి 24 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. డి.గణేష్ 571 మార్కులతో మొదటి స్థానంలో, విజ్ఞజిత్‌రాజ్ 565 మార్కులతో రెండో స్థానంలో, తన్విక 561 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ప్రభుత్వ పాఠశాలలో 16 మంది విద్యార్థులకుగాను 16 మంది పాస్ అయ్యారు. గుబ్బల ప్రియాంక 522 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది.

సత్తా చాటిన జికె.వీధి మండల విద్యార్థులు

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాల పదో తరగతి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి సత్తాను చాటారు. 23 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా శతశాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో టి.ఉద్భవ్ 600కు 550 మార్కులు సాధించి పాఠశాల, జికె.వీధి మండల టాపర్‌గా నిలిచారు. ఎస్.కె జుబేదా 545 మార్కులతో పాఠశాల ద్వితీయ స్థానంలో, కె.తేజశ్రీ 544 సాధించి తృతీయ స్థానంలో నిలిచారు.

సీలేరు ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థులు 68 మంది పదోతరగతి పరీక్షలు రాగా, 100శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 64 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్, మరో నలుగురు విద్యార్థులు సెకండ్ క్లాసులో ఉత్తీర్ణులయ్యారు. డి.వరుణ్ సందేశ్ 517 సాధించి స్కూల్ టాపరుగా నిలినట్లు ప్రిన్సిపాల్ బుచ్చిబాబు వెల్లడించారు.

దారకొండ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 89.65 శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.హేమచందర్ వెల్లడించారు. 29 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా 28 మంది ఉత్తీర్ణత సాధించారు. కొర్ర బాలు 430 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిల్చాడు.

సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 35 మంది పరీక్షలు రాయగా 30 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం తెలిపారు. కె.మంగ 444 మార్కులతో స్కూలు టాపర్‌గా ఎస్‌కె.సబీనా బేగం 600 418 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు.

టి. ఉద్భవ్ ఎస్‌కె. జుబేదా కె.తేజశ్రీ

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 1 నుంచి

గ్రూప్-2 మెయిన్స్ కోచింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం అధ్వర్యంలో గ్రూపు-2 మెయిన్స్ కోచింగ్ మే 1వ తేదీ నుంచి ప్రారంభం కానుందని ఎవికె స్టడీ సర్కిల్ నిర్వాహకులు డాక్టర్ జి.ప్రియాంక తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పోటీ పరీక్షల శిక్షణ సామాన్యులకు అందుబాటులో ఉంచే ఉద్దేశ్యంతో నడుస్తున్న ఈ సెంటర్ మంచి ఫలితాలు సాధిస్తోందని పేర్కొన్నారు. గ్రూపు-2 మెయిన్స్ కోచింగ్ కోసం ఆసక్తిగల అభ్యర్థులు 8374537181, 8886578595 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ శిక్షణ రెండు నెలల పాటు ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు ఉంటుందని, గ్రూపు చర్చలు, మోడల్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. అనుభవిజ్ఞులైన బోధకులచే పాఠాలు బోధించబడతాయని తెలిపారు.

ప్రిలిమ్స్‌లో ప్రతిభ కనబరిచిన వారికి అభినందనలు

అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న గ్రూపు - 2 స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన వారు ఇటీవలే వచ్చిన ప్రిలిమ్స్ ఫలితాల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. వారందరికీ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు వియస్.పద్మనాభరాజు, డాక్టర్ బి.గంగారావు అభినందనలు తెలిపారు.

రహదారిపై కూలిన భారీ వృక్షం

ప్రజాశక్తి- సీలేరు

జీకే వీధి మండలం గుమ్మరేవులు పంచాయితీ బొరుకుల గొంది గ్రామ సమీప రహదారుపై శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రమాద వాస్తు ఎండిపోయిన భారీ వృక్షం ఒక్కసారిగా కూలిపోయింది. ఆ శబ్దానికి ఆ సమీప గ్రామస్తులు తీవ్ర భయాందోళన గురయ్యారు. ప్రతిరోజు నర్సీపట్నం డిపోకు చెందిన నర్సీపట్నం గుమ్మరేవుల బస్సు సర్వీసు ఇదే రహదారి మీదగా నేలజర్త తదితర గ్రామాలు దాటుకుని గుమ్మరేవులు చేరుకుంటుంది. బస్ సర్వీస్ ఆదివారం ఉదయం 9.30 గంటలకు గుమ్మరేవులు బస్సు రహదారి గుండా బొరుకుల గొంది, సమీపానికి వచ్చేసరికి రహదారిపై భారీ వృక్షం కూలి ఉండడంతో డ్రైవర్ గమనించి ముందుగానే బస్సును నిలిపివేశారు. అనంతరం నేలజర్త గ్రామస్తులకు సమాచారం చేరవేశారు. మార్కు రాజు వెంటనే స్పందించి ఆ ప్రదేశానికి చేరుకొని కోత మిషన్‌తో భారీ వృక్షాన్ని ముక్కలుగా కోసి తొలగించారు. 11 గంటల వరకు ప్రయాణికులు నిరీక్షించవలసిన పరిస్థితి నెలకొంది. బస్సులో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, ప్రయాణికులు 25 మంది ఉన్నారు. బస్సులో ప్రయాణికులు ప్రయాణించేటప్పుడు ఈ భారీ వృక్షం కూలి ఉంటే పెను ప్రమాదమే జరిగి ఉండేదని బస్సులో ప్రయాణికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేశారు.

కూలిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం

టిడిపి సీనియర్ నాయకులు పాపారావు మృతి

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దారాలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు మాడుగుల పాపారావు దారకొండలో సోమవారం ఉదయం మృతి చెందారు. కొన్ని సంవత్సరాలగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. పాపారావు మృతి పట్ల టిడిపి నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతదేహం వద్ద ఘన నివాళులర్పించి అంతిమ వీడ్కోలు పలికారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. దారాలమ్మ అమ్మవారి అలయ కమిటీ చైర్మన్‌గా టిడిపి ప్రభుత్వ హయాంలో 2014-2019 మధ్య కాలంలో సేవలందించారు. పాపారావు చైర్మన్‌గా ఉన్న కాలంలో హుండీ ఆదాయం పెరిగింది. ఆ ఐదేళ్లలో 20 లక్షలు ఆదాయం సమకూర్చిన ఘనత ఆయనకే దక్కింది. 2019 జరిగిన ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం రావడంతో ఆయన చైర్మన్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు.

పది ఫలితాల్లో మెరుగు

ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయి
విశాఖ జిల్లాలో 91.15 శాతం, అనకాపల్లి జిల్లాలో 89.04 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, ఆరిలోవ విలేకరి

సోమవారం విడుదలైన పది ఫలితాల్లో రాష్ట్రంలో విశాఖపట్నం జిల్లాకు 8, అనకాపల్లి జిల్లాకు 12వ స్థానం దక్కింది. రెండు జిల్లాల్లోనూ ఉత్తీర్ణతలో బాలురు కంటే బాలికలే పైచేయి సాధించారు. విశాఖపట్నం జిల్లాలో 28,299 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వీరిలో బాలురు 14,932 మంది, బాలికలు 13,367 మంది వున్నారు. ఉత్తీర్ణులైన 25,794 (91.15 శాతం) మందిలో బాలురు 13,449 (90.07 శాతం) మంది, బాలికలు 12,345 (92.35 శాతం) మంది వున్నారు. ఉత్తీర్ణతా శాతం 2023లో వచ్చిన 82.68 శాతం నుంచి 2024 ఫలితాల నాటికి 91.15 శాతానికి పెరిగింది. విశాఖ జిల్లాలో ఉత్తీర్ణులైన 25,794 మంది విద్యార్థుల్లో ప్రథమ శ్రేణిలో 21,998 మంది, ద్వితీయ శ్రేణిలో 2,620 మంది, తృతీయ శ్రేణిలో 1176 మంది వున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అనకాపల్లి జిల్లాలో పది పరీక్షలు రాసిన 21,169 మందిలో బాలురు 10,820 మంది, బాలికలు 10,349 మంది వున్నారు. వీరిలో ఉత్తీర్ణులైన 18,848 మంది విద్యార్థుల్లో బాలురు 9,384 (86.73 శాతం) మంది, బాలికలు 9,464 (91.44 శాతం) మంది ఉన్నారు. జిల్లాలో ఉత్తీర్ణులైన 18,848 మంది విద్యార్థుల్లో ప్రథమ శ్రేణిలో 14,725 మంది, ద్వితీయ శ్రేణిలో 2,867 మంది, తృతీయ శ్రేణిలో 1256 మంది వున్నారు. 2023లో 77.74 శాతం ఫలితం రాగా, ఈ ఏడాది 89.04 శాతానికి పెరిగింది.

స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై

జగన్ నోరు మెదపకపోవడం దారుణం

బిజెపితో లాలూచీ బట్టబయలు
సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై సిఎం జగన్ మోహన్ రెడ్డి నోరు మెదపకపోవడం దారుణమని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి, ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బిజెపితో జగన్ మోహన్ రెడ్డి లాలూచీ మరొకసారి బట్టబయలైందని తెలిపారు. సిఎం జగన్ రెండు రోజులు విశాఖలో ఉండి ఉక్కు కర్మాగారంపై కనీసం పెదవి విప్పలేదన్నారు. అమ్మకం నుండి ప్లాంట్‌ను కాపాడతామన్న మాట కూడా అనలేదన్నారు. ఈ అవకాశవాద వైఖరిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. రెండేళ్ల నుంచి ప్లాంట్‌ని బిజెపి అష్టదిగ్బంధనం చేస్తోందని తెలిపారు. ఉత్పత్తికి సగానికి సగంకోత పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అదానీని స్టీల్‌ప్లాంట్‌పై ఉపయోగిస్తోందని తెలిపారు. పోర్టు కార్మికుల సమ్మె పరిష్కారం చేయకుండా ప్లాంట్‌కి బొగ్గు సరఫరాను నిలుపుదల చేసి ప్లాంట్‌ను మరింత సంక్షోభంలోకి నెట్టిందన్నారు. ఇప్పుడు ప్లాంట్‌ను ఏకంగా మూసివేయాలనే కుట్రలకు తెగబడిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్లాంట్ రక్షణకు అండగా ఉంటానని, బిజెపికి వ్యతిరేకంగా పోరాడుతానని మాట్లాడకపోవడం జగన్ మోహన్ రెడ్డి ద్రోహం తేటతెల్లమవుతోందని పేర్కొన్నారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు కూడా మొన్న గాజువాకలో ఎన్నికల సభ పెట్టి మోడీ జపం చేశారన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై దిగజారి మాట్లాడారని తెలిపారు. ఈ పార్టీలు స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటం కన్నా బిజెపితో అవకాశవాద రాజకీయంతో ప్లాంట్ అమ్మకానికి లేదా మూసివేతకు మద్దతు ఇస్తున్నాయనేది స్పష్టమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో బిజెపితో జతకట్టి లొంగిపోయి రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్న ఆ పార్టీలను ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు జగ్గునాయుడు విజ్ఞప్తి చేశారు. తద్వారా మాత్రమే విశాఖ స్టీల్‌ప్లాంట్ మోడీ చెర నుండి రక్షించబడుతుందని తెలిపారు.

లోయలోపడ్డ లారీ

ప్రజాశక్తి-మోతుగూడెం : అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు మండలం, ఘాట్ రోడ్‌లో వ్యూ పాయింట్ వద్ద సోమవారం కొబ్బరికాయలు లోడుతో వస్తున్న లారీ, అదుపుతప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వైభవంగా రాములవారి పట్టాభిషేకం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు రామాలయంలో రాములవారి పట్టాభిషేక కార్యక్రమం వైభవంగా జరిగింది. పలువురు జంటలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని భక్తుల ఆర్థిక సహాయంతో ఆలయ కమిటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేశారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలస గెడ్డ రామాలయాలలో రాముల వారి పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు.

నామినేషన్ దాఖలు చేస్తున్న విశాఖ వైసిపి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ

పోటాపోటీగా బొత్స ఝాన్సీ, శ్రీ భరత్ నామినేషన్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : విశాఖ పార్లమెంటు స్థానానికి వైసిపి అభ్యర్థిగా, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిగా ఎం.శ్రీ భరత్ సోమవారం నగరంలో భారీ స్థాయిలో ర్యాలీలు నిర్వహించి, కలెక్టరేట్‌కు వచ్చి, జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఝాన్సీ కుమార్తె బొత్స అనూష డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అలాగే శ్రీ భరత్ సతీమణి తేజస్విని నామినేషన్ వేశారు. నామినేషన్లు దాఖలు చేయడానికి ముందుగా కూటమి అభ్యర్థి ఎం.శ్రీభరత్ ఎంవిపి.కాలనీలోని తన ఎన్నికల కార్యాలయం నుంచి వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. మద్దిలపాలెం, గురుద్వారా, ఆర్‌టిసి కాంప్లెక్స్, డాబా గార్డెన్స్, మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. ర్యాలీలో శ్రీ భరత్‌తో పాటు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, పి.గణబాబు, పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, దక్షిణ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర కూటమి అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్సీ పివి.ఎన్ మాధవ్, ఎస్.కోట అభ్యర్థి కోళ్ల లలిత కుమారి, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థి బొత్స ఝాన్సీ బీచ్ రోడ్డులోని తన ఎన్నికల కార్యాలయం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు వేలాది మందితో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు, వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జ్ వైవి.సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గాజువాక, విశాఖ దక్షిణ, ఎస్.కోట ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైసిపి ఉత్తర నియోజవర్గం అభ్యర్థి కెకె.రాజు, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకటరామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, మళ్ల విజయప్రసాద్, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, వైసిపి ఉత్తరాంధ్ర యువజన విభాగం జోనల్ ఇంఛార్జ్ అవనాపు విక్రమ్, విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) ఛైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలు అందిస్తున్న విశాఖ టిడిపి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్